బైక్ ర్యాలీకి తరలి వెళ్లిన నాయకులు

విస్సన్నపేట: ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రమాణ స్వీకారం చేసి నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా తిరువూరులో ఎమ్మెల్యే కొక్కిలిగడ్డ రక్షణనిధి ఆధ్వర్యంలో నిర్వహించిన బైక్ ర్యాలీలో పాల్గొనేందుకు సోమవారం మండలం నుంచి వైఎస్సార్ సీపీ నాయకులు భారీగా తరలివెళ్లారు. జెడ్పీటీసీ సభ్యుడు భీమిరెడ్డి లోకేశ్వరరెడ్డి, ఎంపీపీ పిల్లి మెర్సీవనజాక్షి, వైస్‌ఎంపీపీ రెడ్డి శ్రీనివాసరావు, తదితరులు తరలివెళ్లినవారిలో ఉన్నారు.

హామీలన్నింటినీ అమలు చేసిన సీఎం జగన్

ఎమ్మెల్యే రక్షణనిధి

తిరువూరు: ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను గత నాలుగేళ్లలో నూరుశాతం అమలు చేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికే దక్కుతుందని తిరువూరు ఎమ్మెల్యే కే రక్షణ నిధి అన్నారు. ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు చేపట్టి నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా సోమవారం వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో తిరువూరులో పార్టీ నాయకులు, కార్యకర్తలు బైక్ ర్యాలీ నిర్వహించారు. నియోజకవర్గ కార్యాలయం నుంచి ప్రధాన వీధుల మీదుగా ఈ ప్రదర్శన జరిపారు. చీరాల సెంటర్లో జరిగిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇచ్చిన హామీలను నెరవేర్చిన తర్వాతే వచ్చే ఎన్నికల్లో ఓట్లు అడుగుతామని ముఖ్యమంత్రి పదే పదే చెబుతున్నారన్నారు. ఇచ్చిన హామీలతో పాటు ప్రజల ఇబ్బందులు గుర్తించి మరిన్ని కొత్త పథకాలు అమలు చేశారన్నారు. తిరువూరు నియోజకవర్గంలో రూ.1,500 కోట్లకు పైగా నిధులను గత నాలుగేళ్లలో ప్రభుత్వం మంజూరు చేసిందని, త్వరలోనే అభివృద్ధి పనులకు నిధులు వస్తాయని తెలిపారు. ఏఎంసీ చైర్మన్ శీలం నాగ నర్సిరెడ్డి, తిరువూరు, విస్సన్నపేట జెడ్పీటీసీ సభ్యులు యరమల రామచంద్రారెడ్డి, లోకేశ్వరరెడ్డి, ఎంపీపీలు వనజాక్షి, శ్రీలక్ష్మి పాల్గొన్నారు.



తిరువూరులో ఎమ్మెల్యే రక్షణనిధి ఆధ్వర్యంలో నిర్వహించిన బైక్ ర్యాలీ

స్విమ్మింగ్‌పూల్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే ప్రతాప్

నూజివీడు: పట్టణంలోని వికాస్ టౌన్‌షిప్‌లో నిర్మించిన సిమ్మింగ్‌పూల్‌ను ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు సోమవారం ప్రారంభించారు. పట్టణంలో వరల్డ్‌క్లాస్ సదుపాయాలు మరిన్ని రావాల్సుందని, పట్టణ ప్రజలు కూడా వీటిని ఆదరించాలని ఎమ్మెల్యే అన్నారు. ఇప్పటి వరకు నూజివీడులో స్విమ్మింగ్‌పూల్ లేదని, నిర్వాహకులు రూ.1.50 కోట్లు వరకు వెచ్చించి స్థలాన్ని కొనుగోలు చేసి స్విమ్మింగ్‌పూల్‌ను నిర్మించారని తెలిపారు. పిల్లలకు, మహిళలకు, పురుషులకు ఇక్కడ స్విమ్మింగ్ నేర్పుతారన్నారు. కార్యక్రమంలో స్విమ్మింగ్‌పూల్ నిర్వాహకులు, మున్సిపల్ వైస్ చైర్మన్ పగడాల సత్యనారాయణ, కోఆప్షన్ సభ్యులు రామిశెట్టి మురళీకృష్ణ, కౌన్సిలర్ హరికోటి రమాదేవి పాల్గొన్నారు.



స్విమ్మింగ్‌పూల్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మేకా ప్రతాప్ అప్పారావు

పంపిణీకి సిద్ధంగా జగనన్న విద్యా కానుక

ఇబ్రహీంపట్నం: జగనన్న విద్యా కానుక పంపిణీకి సిద్ధంగా ఉన్నట్లు ఎంపీపీ పాలడుగు జ్యోత్స్న తెలిపారు. ఇబ్రహీంపట్నం మండల పరిషత్ కార్యాలయంలో జగనన్న విద్యా కానుక మెటీరియల్ బ్యాగులు, యూనిఫామ్, బెల్టులు, పుస్తకాలు తదితర వస్తువులను సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులతో కలిసి ఎంపీపీ జ్యోత్స్న సోమవారం ఆవిష్కరించారు. మండలంలోని పాఠశాలల్లో విద్యార్థులకు అవసరమైన జగనన్న విద్యా కానుక మెటీరియల్ గుంటుపల్లి స్టాక్ పాయింట్‌కు చేరిందన్నారు. స్టాక్ పాయింట్ నుంచి ప్రత్యేక వాహనాల ద్వారా ఆయా పాఠశాలలకు చేర్చాలని విద్యాశాఖ అధికారులు సూచించారు. పాఠశాలలు పునఃప్రారంభం అయిన వెంటనే విద్యార్థులకు జగనన్న విద్యా కిట్లు అందజేస్తారన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రామకృష్ణ నాయక్, తహసీల్దారు సూర్యారావు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

రెడ్డిగూడెం: మండలంలోని బూరుగగూడెంలో సోమ వారం నాబార్డు అగ్రికల్చర్, ధృతికృష్ణ రైతు సంఘం, కృష్ణసుధా అకాడమీ వారు నిర్వహించిన లైఫ్‌స్టైల్ ఎన్విరాన్‌మెంట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నాబార్డు ప్రతినిధులు భరత్, రవితేజ మాట్లాడుతూ మట్టి ఆరోగ్య గురించి, ప్రకృతి వ్యవసాయ పద్ధతులతో వ్యవసాయం చేయడం వల్ల భూమికి, పర్యావరణానికి మేలు జరుగుతుందన్నారు. రైతులందరూ కలసి సంఘంగా ఏర్పడి ప్రకృతి వ్యవసాయం పద్ధతులతో వ్యవసాయం చేయడమే సరైన పరిష్కారమని తెలిపారు. పర్యావరణ పరిరక్షణ కోసం రైతులందరితో కలసి సంస్థ ప్రతినిధులు ప్రతిజ్ఞ చేశారు.

ప్రభుత్వ సంక్షేమ అభివృద్ధి పథకాలపై సమీక్ష

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ పాలడుగు జ్యోత్స్న అధ్యక్షతన సోమవారం జరిగింది. సమావేశంలో గ్రామాల్లో ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమం, అభివృద్ధి పథకాలపై సమీక్ష నిర్వహించారు. వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు ఆయా శాఖల పరిధిలో గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులుపై నివేదికలు వివరించారు. ఎంపీపీ నిధులతో జరుగుతున్న అభివృద్ధి పనులపై సమీక్ష జరిపారు. ఎంపీడీఓ రామకృష్ణ నాయక్, తహసీల్దారు సూర్యారావు, వైస్ ఎంపీపీ బాణావత నాగబాలమ్మ పాల్గొన్నారు.

గణితంపై పట్టు సాధించాలి

మైలవరం: గణితంపై విద్యార్థులు పట్టు సాధించాలని మైలవరం ఆక్స్‌ఫర్డ్ హైస్కూల్ గణితం ఉపాధ్యాయులు ఎం.శ్రీనివాసరావు తెలిపారు. మైలవరం శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిక్షణ శిబిరంలో భాగంగా సోమవారం విద్యార్థులకు తిండిపోతు దయ్యం కథల పుస్తకాలు చదివించి, చెప్పించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుడు శ్రీనివాసరావు మాట్లాడుతూ గణితం మానవుల దైనందిన కార్యక్రమాలతో ముడిపడి ఉందన్నారు. గ్రంథాలయ సిబ్బంది సయ్యద్ అహ్మద్, రాంబాబు పాల్గొన్నారు.

గ్రంథాలయాల్లో క్విజ్ పోటీలు

చాట్రాయి: మండలంలోని చనుబండ, చాట్రాయి గ్రంథాలయాల్లో సమ్మర్ క్యాంప్‌లో భాగంగా సోమవారం విద్యార్థులకు క్విజ్ పోటీలు, పొడుపు - ఇడుపు ప్రశ్నలను అడగం లాంటివి నేర్పించారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారులు శ్రీకాంత్, మణికంఠ పాల్గొన్నారు.

మహనీయుల జీవిత చరిత్రను తెలుసుకోవాలి

నూజివీడు: మహనీయుల జీవిత చరిత్రను చదవడం ద్వారా తెలుసుకోవాలని రిటైర్డ్ ఉపాధ్యాయుడు ఈమని శేషయ్య అన్నారు. స్థానిక ప్రథమశ్రేణి గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరం సోమవారం 22వ రోజుకు చేరింది. ఝాన్సీరాణి జీవితం గురించి విద్యార్థులకు శేషయ్య వివరించారు. ఆమె ధైర్య సాహసాలతో ఆంగ్లేయులతో పోరాడిందని పేర్కొన్నారు. విద్యార్థులు ఖాళీ సమయంలో తప్పనిసరిగా విజ్ఞాన, కథల, మహనీయుల జీవిత చరిత్ర పుస్తకాలను చదవాలని సూచించారు. దీంతో విజ్ఞానం మరింత పెరుగుతుందని, సెల్‌ఫోన్, టీవీలకు దూరంగా ఉండాలన్నారు. .

గొల్లపల్లిలో..

మండలంలోని గొల్లపల్లి శాఖా గ్రంథాలయంలో సోమవారం వేసవి శిక్షణ శిబిరంలో విద్యార్థులతో పుస్తక పఠనం చేయించారు. గొల్లపల్లి హైస్కూల్ సోషల్ ఉపాధ్యాయుడు బి.పుల్లారావు గ్రంథాలయాల ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. . కార్యక్రమంలో గ్రంథాలయాధికారి డొక్కు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పచ్చిరొట్ట విత్తనాల పంపిణీ

జి.కొండూరు: రైతులకు పచ్చిరొట్ట విత్తనాల పంపిణీలో అధికారులు నిష్పక్షపాతంగా వ్యవహరించి ప్రతిఒక్కరికీ విత్తనాలు అందేలా చర్యలు చేపట్టాలని ఎంపీపీ వేములకొండ లక్ష్మీతిరుపతమ్మ అన్నారు. మండల పరిధి ఆత్కూరు, వెల్లటూరు రైతు భరోసా కేంద్రాలలో జెడ్పీటీసీ సభ్యుడు మందా జక్రధరరావు, వ్యవసాయ సలహా మండలి జిల్లా కమిటీ సభ్యుడు కాజా బ్రహ్మయ్యతో కలిసి ఎంపీపీ లక్ష్మీతిరుపతమ్మ రైతులకు పచ్చిరొట్ట విత్తనాలను సోమవారం పంపిణీ చేశారు.

జగనన్న విద్యా కానుక స్టాక్ పాయింట్ పరిశీలన

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నంలోని జగనన్న విద్యా కానుక-4 స్టాక్ పాయింట్‌ను, నాడు, నేడు ఫేజ్-11 స్కూల్స్‌ను ఎన్టీఆర్ జిల్లా ఎడిషనల్ ప్రాజక్టు కో-ఆర్డినేటర్(ఏపీసీ) జీ మహేశ్వరరావు సోమవారం తనిఖీ చేశారు. జగనన్న విద్యా కానుక కిట్ల క్వాలిటీ చెక్ చేశారు. ఐటెమ్స్ అన్ని కూడా స్టాక్ పాయింట్‌లో సిద్ధంగా ఉన్నాయని, ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాగానే అన్ని పాఠశాలలకు సరఫరా చేయడం జరుగుతుందన్నారు. అదేవిధంగా నాడు-నేడు పాఠశాలలను కూడా తనిఖీ చేశారు. జూపూడి ఎంపీపీ పాఠశాల, కొటికలపూడి ఎంపీపీ పాఠశాల, మూలపాడు జెడ్పీ ఉన్నత పాఠశాల, కొండపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల, కొండపల్లి అడవి క్వారీ పాఠశాలను సందర్శించి జూన్ 10 కల్లా అన్ని పాఠశాలల్లో నాడు-నేడు పనులు మొత్తం పూర్తి చేయాలని, సంబంధిత పంచాయతీరాజ్ ఏఈ, ఎంఈఓ, మున్సిపల్ ఏఈ, ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లకు సీఆర్‌పీలకు, హెచ్‌ఎం తగు సూచనలిచ్చారు.

సంక్షిప్తం

పరిశుభ్రత పాటించాలి

చాట్రాయి: అంతర్జాతీయ రుతుస్రావ పరిశుభ్రత దినోత్సవం సందర్భంగా రుతుస్రావంలో మహిళలు తీసుకోవాల్సిన జాగ్రతలపై చాట్రాయి గ్రామంలో సోమవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో డ్రైవర్‌కు తీవ్ర గాయాలు

జి.కొండూరు: ఓ లారీ ట్రాక్టర్‌ను ఢీకొట్టిన ఘటనలో లారీ డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. జి.కొండూరు వైపు నుంచి మామిడికాయల లోడుతో ట్రాక్టరు కందులపాడు వైపు సోమవారం రాత్రి ఎనిమిది గంటల సమయంలో వెళుతోంది. అదే సమయంలో కందులపాడు వైపు నుంచి లారీ జి.కొండూరు వైపు వస్తూ ఎదురుగా వస్తున్న మామిడికాయల లోడు ట్రాక్టరును ముత్యాలంపాడు గ్రామ శివారులో ఢీకొంది. ఈ ప్రమాదంలో ట్రాక్టరు ట్రక్కు పడిపోగా లారీ రహదారి పక్కనే ఉన్న పొలాల్లోకి దూసుకెళ్లింది. కాగా లారీ నడుపుతున్న డ్రైవర్ తిరుపతిరావుకు కుడికాలు విరిగిపోవడంతో స్పృహ కోల్పోయాడు. స్థానికులు వెంటనే స్పందించి లారీలో ఇరుక్కుపోయిన డ్రైవర్‌ను బయటకు తీసి 108 అంబులెన్స్‌లో విజయవాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. సంఘటన స్థలాన్ని పరిశీలించిన జి.కొండూరు పోలీసులు దర్యాప్తు చేపట్టారు. క్షతగాత్రుడు తిరుపతిరావు ఇబ్రహీంపట్నం మండలం తుమ్మలపాలెం గ్రామానికి చెందిన వ్యక్తిగా తెలిసింది.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠ పూజలు

గోసవీడు(గంపలగూడెం): గోసవీడులో నూతనంగా నిర్మించిన పలు ఆలయాల్లో ఈ నెల 31వ తేదీన విగ్రహ ప్రతిష్ఠలు చేయనున్న నేపథ్యంలో మూడు రోజుల పాటు జరగనున్న ప్రత్యేక పూజలను సోమవారం ఘనంగా ప్రారంభించారు. విఘ్నేశ్వర పూజతో ప్రత్యేక పూజలను అర్చకులు ఆరిపిరాల అప్పయ్యశాస్త్రి, అర్చక బృందంచే శాస్త్రోక్తంగా ప్రారంభించారు. అంకురార్పణ, దేవతామూర్తులకు అభిషేకం, జలాధివాసం, హోమాలను సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. గ్రామంలో పునర్నిర్మించిన విశ్వేశ్వరస్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ, నూతన ఆలయాల్లో అక్కలమ్మ, ముత్యాలమ్మ, దేవతల విగ్రహాల ప్రతిష్ఠ, ఆంజనేయ స్వామి ఆలయంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠ, బొడ్డురాయి ప్రతిష్ఠలతను నిర్వహించనున్నారు.

కల్యాణ వేదికను ప్రారంభించనున్న వైవీ సుబ్బారెడ్డి

జూపూడి (ఇబ్రహీంపట్నం): ఇబ్రహీంపట్నం మండలం జూపూడిలోని శ్రీవెంకటేశ్వర స్వామి ఆలయం వద్ద నిర్మించిన నూతన కల్యాణ వేదికను తిరుమల తిరుపతి దేవస్థానం చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, స్థానిక ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ మంగళవారం ప్రారంభించనున్నారు. వేద మూర్తులైన వెలమకన్ని సత్యనారాయణ, పార్వతి దంపతులచే నూతనంగా నిర్మించబడిన శ్రీపద్మావతి గోదా సమేత శ్రీవేంకటేశ్వరస్వామి వారి కల్యాణ వేదికను ఉదయం 11 గంటలకు వైవీ సుబ్బారెడ్డి ప్రారంభించనున్నారు.

మూలపాడులో లెక్కల రగడ

మూలపాడు(ఇబ్రహీంపట్నం): మండలంలోని మూలపాడు గ్రామ పంచాయతీలో సర్పంచ్ చింతల భూలక్ష్మి, గ్రామ కార్యదర్శి డీ రాణి మధ్య నగదు లెక్కల వివాదం ముదిరింది. 2019 నుంచి పంచాయతీ ఆదాయ వ్యయాలు, ఇంటి పన్నుల వసూళ్లను వివరించాలని కోరగా అందుకు కార్యదర్శి వివరించలేదని సర్పంచ్ భూలక్ష్మి ఆరోపిస్తోంది. సర్పంచ్ భర్త వెంకట్రావు రూ.10 లక్షల బిల్లులకు నగదు చెల్లించాలని తనపై ఒత్తిడి తెస్తున్నారని కార్యదర్శి రాణి చెబుతున్నారు. సర్పంచ్ వేధింపులు తట్టుకోలేక ఇటీవల కాలంలో కార్యదర్శి సెలవుపై వెళ్లారు. ఈ నెల 17న విధులకు హాజరు కానున్న విషయం తెలుసుకున్న సర్పంచ్ భర్త వెంకట్రావు కార్యదర్శి గదికి తాళం వేశారు. ఈ విషయాన్ని ఆమె ఎంపీడీఓ రామకృష్ణ నాయక్ దృష్టికి తీసుకెళ్లారు. ప్రస్తుతం ఆమె ఎంపీడీఓ కార్యాలయం నుంచి విధులు నిర్వహిస్తున్నారు. కార్యదర్శి ఖర్చు చేసిన సుమారు రూ.6లక్షలు, సర్పంచ్ ఖర్చు పెట్టిన రూ.10 లక్షల పంచాయితీ ఎంపీడీఓ రామకృష్ణ నాయక్ వద్దకు చేరింది. ఇరువురిని పిలిపించి రికార్డులు పరంగా లెక్కలు తేల్చే పనిలో ఉన్నారు.

కూలీలను వడదెబ్బ బారి నుంచి కాపాడాలి

గోపవరం(ముసునూరు): మండుటెండల్లో పని చేస్తున్న ఉపాధి కూలీలను వడదెబ్బ బారి నుంచి కాపాడేందుకు అవసరమైన సౌకర్యాలు కల్పించాలని వైస్ ఎంపీపీ పాముల గంగాధర్ అన్నారు. గోపవరం పెద్ద చెరువు సప్లయి చానల్స్ పనులను సోమవారం ఆయన పరిశీలించారు. తన సొంత నిధులతో చల్లని మంచినీరు, మజ్జిగ ఉపాధి కూలీలకు అందజేశారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు కోటగిరి గోపాలకృష్ణ, గ్రామ సర్పంచ్ వాణి, ఉపసర్పంచ్ లక్ష్మయ్య, వైఎస్సార్ సీపీ గ్రామ అధ్యక్షుడు వల్లభనేని గోపి, ఎంపీటీసీలు వెంకమ్మ, ఖాలీషా మస్తాన్ వలి పాల్గొన్నారు.

స్పందనలో మూడు అర్జీలు

గంపలగూడెం: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో మూడు అర్జీలు వచ్చినట్లు ఎంపీడీఓ వై పిచ్చిరెడ్డి తెలిపారు. తహసీల్దార్ జి. బాలకృష్ణారెడ్డి, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

కేతనకొండ(ఇబ్రహీంపట్నం): ఆగి ఉన్న టిప్పర్ లారీని ట్రాలీ లారీ ఢీకొన్న ఘటనలో ట్రాలీ డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ఇబ్రహీంపట్నం మండలం కేతనకొండ వద్ద 65వ నంబర్ జాతీయ రహదారిపై సోమవారం ఈ ప్రమాదం జరిగింది. దొనబండ నుంచి కంకర లోడ్‌తో వస్తున్న టిప్పర్ లారీ కేతనకొండ వద్ద రోడ్డు పక్కన ఆగి ఉంది. ఆ సమయంలో గుజరాత్ నుంచి విజయవాడకు పైపుల లోడ్‌తో వస్తున్న ట్రాలీ లారీ ఆగి ఉన్న టిప్పర్‌ను వెనుక వైపు ఢీకొంది. ఈ ప్రమాదంలో ట్రాలీ డ్రైవర్ అర్జున సింగ్ తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికుల సమాచారం అందుకున్న 108 వాహన సిబ్బంది గాయపడిన డ్రైవర్‌ను చికిత్స నిమిత్తం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఇబ్రహీంపట్నం పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ప్రమాద వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

క్యాంపస్ సెలక్షన్స్‌లో ఆరుగురు ఎంపిక

తిరువూరు: స్థానిక శ్రీవాహినీ ఇంజినీరింగ్ కళాశాలలో విద్యార్థులకు ఇటీవల నిర్వహించిన క్యాంపస్ సెలక్షన్స్‌లో ఆరుగురు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ నాగేంద్ర బాబు తెలిపారు. ఎంఎన్‌సీ సంస్థ సొనాటా సాఫ్ట్‌వేర్ కంపెనీలో తమ విద్యార్థులు ఎంపికయ్యారని పేర్కొన్నారు. వీరిని కళాశాల చైర్మన్ వెంకటేశ్వరరావు, కార్యదర్శి సుబ్రహ్మణ్యం, కరస్పాండెంటు నాగేశ్వరరావు అభినందించారు.

తెలంగాణకు బస్సులు నడపాలి

తిరువూరు: రాష్ట్ర విభజన తర్వాత తిరువూరు డిపో నుంచి రద్దు చేసిన తెలంగాణా ప్రాంతాలకు వెళ్లే బస్సు సర్వీసులు పునరుద్ధరించాలని సీపీఎం నాయకులు సోమవారం డీఎం వేణుకు వినతిపత్రం అందజేశారు. తెలంగాణా రాష్ట్రంలోని పలు ప్రాంతాలకు నిత్యం రాకపోకలు సాగించే తిరువూరు డివిజన్ ప్రజలకు సరైన బస్సుసదుపాయం లేక ప్రైవేటు వాహనాలను ఆశ్రయించాల్సి వస్తోందని, ఖమ్మంకు ప్రతి అరగంటకు బస్సుసర్వీసు నడపాలని పేర్కొన్నారు. హైదరాబాదుకు పగటివేళ బస్సుసర్వీసులు పునరుద్ధరించాలని కోరారు.

జెడ్పీహెచ్‌ఎస్‌లో ఇంటర్ కోర్సులు

మైలవరం: స్థానిక జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో ఇంటర్ ఎంపీసీ, బైపీసీ కోర్సులు గత సంవత్సరం నుంచి ప్రారంభించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎం. శ్రీలత సోమవారం తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో నూతనంగా ప్రారంభించిన జూనియర్ కళాశాలను బాలికలకు మాత్రమే ప్రత్యేకంగా ప్రభుత్వంచే నడుపుతున్నట్లు పేర్కొన్నారు. అనుభవజ్ఞులైన ఉపాధ్యాయుల పర్యవేక్షణలో ఉత్తమ ఫలితాలు సాధిస్తున్న ప్రభుత్వ పాఠశాల, ఇంటర్ మొదటి బ్యాచ్‌లో 392, 372 మార్కులతో, పదో తరగతిలో 582, 576, 571తో పాటు 500 పైగా 16 మంది విద్యార్థినులు అత్యధిక మార్కులు సాధించారని పేర్కొన్నారు.







మోసం చేయడం చంద్రబాబు నైజం



పెద్దగాంధీబొమ్మ సెంటర్లో ప్రజలనుద్దేశించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు

నూజివీడు: ప్రతిపక్ష నేత చంద్రబాబుకు రాష్ట్ర ప్రజలను మోసం చేయడం, వెన్నుపోటు పొడవడం వెన్నతో పెట్టిన విద్య అని ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు పేర్కొన్నారు. ప్రభుత్వం పేదలకు స్థలాలిచ్చి, ఇళ్ల మంజూరు చేసి రూ.1.80 లక్షలను అందిస్తుంటే ఆ స్థలాలను చంద్రబాబు సమాధులు కట్టుకోవడానికి చాలవంటూ చేసిన వ్యాఖ్యలకు నిరసనగా వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో పట్టణంలో సోమవారం భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. ప్రధాన రహదారుల్లో ర్యాలీ అనంతరం పెద్దగాంధీబొమ్మ సెంటర్లో బహిరంగ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రతాప్ మాట్లాడుతూ గతనెలలో చంద్రబాబు నూజివీడు వచ్చి తాను 350 ఎకరాల అటవీ భూమి ఆక్రమించానని చెప్పారని, ఆ భూమి ఎక్కడ ఉందో చూపిస్తే చంద్రబాబుకు 345 ఎకరాలు, నూజివీడు టీడీపీ ఇన్‌చార్జి ముద్దరబోయిన వెంకటేశ్వరరావుకు ఐదెకరాలు రాసిస్తానని ప్రతాప్ సవాల్ చేశారు. సీఎం వైఎస్ జగన్ నిరంతరం ప్రజల సంక్షేమం, రాష్ట్రాభివృద్ధికి పాటుపడుతున్నారన్నారు. జెడ్పీ వైస్ చైర్మన్ కృష్ణంరాజు, మున్సిపల్ వైస్ చైర్మన్ సత్యనారాయణ, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు శివ పాల్గొన్నారు.

కేక్ కట్ చేసిన ఎమ్మెల్యే మేకా ప్రతాప్

నూజివీడు: ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పదవీబాధ్యతలు చేపట్టి నాలుగు వసంతాలు పూర్తయిన సందర్భంగా సోమవారం వైఎస్సార్ ఫెడరేషన్ ఆర్టీసీ నూజివీడు డిపో నాయకుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కేక్‌ను ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు కట్ చేశారు. మున్సిపల్ వైస్ చైర్మన్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సర్టిఫికెట్స్ పోయినవి

భూక్యా బాలయేసు S/o. గ్యామ, సిద్ధార్థనగర్, నూజివీడు మండలం, ఏలూరు జిల్లా వారికి చెందిన బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్, మార్చి2019, రిజిస్టర్ నెం. 1913125808, సెయింట్ ఆన్స్(EM) హైస్కూల్, నూజివీడు మరియు బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్, మార్చి 2021, రిజిస్టర్ నెం. 2125216007, శ్రీ శారదా జూనియర్ కాలేజ్, నూజివీడులో చదివిన ఒరిజినల్ సర్టిఫికెట్లు జిరాక్స్ కాపీలు తీయించడానికి సిద్ధార్థనగర్ నుండి నూజివీడు వస్తుండగా మార్గం మధ్యలో పోయినవి. దొరికిన వారు పై అడ్రస్సును సంప్రదించగలరు.